క్లుప్తంగా

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



దొండపూడి వద్ద గుంతలను పూడ్చి వేయిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

రావికమతం: బీఎన్‌రోడ్డు రోడ్డులో పలు చోట్ల గుంతలను కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు శనివారం మిక్సర్ గ్రావెల్‌తో పూడ్చివేయించారు. ఈ రోడ్డు విస్తరణ పనులు టి.అర్జాపురం నుంచి పి.పొన్నవోలు వరకు ప్రస్తుతం చేశారు. కొత్తకోట నుంచి దొండపూడి మధ్య ఇంకా పనులు చేపట్టకపోవడంతో పెద్ద గోతులు ఏర్పడి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఎస్‌ఐ స్పందించి మిక్సర్ గ్రావెల్‌ను వేయించారు. ఉప సర్పంచ్ గర్రెడ్డి రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, తదితరులు సహాయ సహకారాలందించారు.

రాయితీపై రబీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో వాసుదేవరావు, సర్పంచ్ కళావతి

మాడుగుల: మండలంలో 23 ఆర్బీకేల్లో రబీ సాగుకు సంబంధించి పెసర, మినుము, వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆయన సర్పంచ్ ఎడ్ల కళావతితో కలిసి రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. వరి -50, పెసర -30, మినుము -10 క్వింటాళ్లు చొప్పున ప్రస్తుతం అందుబాటులో ఉంచామన్నారు. ఆర్బీకే చైర్మన్ కుక్కర శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు



దివ్యాంగ చిన్నారికి బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

రోలుగుంట: స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వరప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. టీచర్లు శ్రావణి, నిహారిక పాల్గొన్నారు.

కొంతలంలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన



అమ్మవారికి పూజలు చేస్తున్న దాతలు రాంబాబు, కల్పన దంపతులు

రోలుగుంట: కొంతలంలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన స్వర్గీయ కుంచంగి అప్పాజి కుమార్తె ఎన్ని కల్పన రూ.7.50 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. నిర్మాణ దాత కల్పన తన భర్త రాంబాబుతో కలసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచంగి వంశీ, ఎంపీటీసీ బంటు నానాజి, మాజీ సర్పంచ్ హరిబాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మాకవరపాలెం: యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.గడ్డినాయుడు, అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డినాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యక్షుడిగా వై.తాతబ్బాయి, గౌరవాధ్యక్షునిగా విజయ్‌బాబు, కోశాధికారిగా ఎం.లత ఎన్నికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థి దశలో నాణ్యమైన పౌష్టికాహారం అందక ఎంతోమంది విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. అనారోగ్యానికి గురై చదువులో చురుగ్గా రాణించలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం సర్వత్రా ప్రశంసలందుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకో మెనూతో రుచికరంగా వండి పెడుతుండటంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు.





నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్(తురకబడి)లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం మండలం, మున్సిపాలిటీ			
ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	51	మొత్తం విద్యార్థులు	6,495
వీరిలో మధ్యాహ్న భోజనం తినేది	5,970	మొత్తం ఉపాధ్యాయులు	320

రోజుకొక మెనూ...

సోమవారం
హాట్ పొంగలి, ఉడికించిన గుడ్డు, కూరగాయల పలావ్, చిక్కీ

మంగళవారం
పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ

బుధవారం
వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ

గురువారం
నిమ్మకాయ పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగిజావ

శుక్రవారం
ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ

శనివారం
తీపి పొంగల్, పప్పు, రసం, రాగిజావ

రుచికరం.. పౌష్టికాహారం

- పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం
- అదనంగా రాగిజావ
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- జగనన్న గోరుముద్ద పథకానికి ప్రశంస

నర్సీపట్నం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గత టీడీపీ హయాంలో నాసిరకమైన వంటకాలతో అరకొరగా మధ్యాహ్న భోజనం పెట్టేవారు. దీన్ని తినేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూసే వారు కాదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఎప్పటికప్పుడు విద్యా కమిటీ అభిప్రాయాలను విద్యా శాఖ సేకరించి, రోజుకోక కూరతో భోజనం అందిస్తున్నారు. రోజూ ఉపాధ్యాయుడు వెళ్లి పదార్థాలను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారు. గతంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడు సార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు. వాటిలో కొన్ని చెడిపోయేవి. విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఏ వారంలో సరఫరా అయిన గుడ్డను అదే వారంలో వినియోగించేలా గుర్తులు వేస్తున్నారు. విద్యార్థులకు ఐదు గుడ్లను అందిస్తోంది.

ఇలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొంటున్న నేపథ్యంలో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



భోజనాన్ని రుచి చూస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

రుచికరంగా వండుతున్నారు..



నేను రోజూ స్కూల్‌లోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నాను. వారానికి ఐదు కోడి గుడ్లు ఇస్తారు. రోజుకొక కూరతో పెడుతున్నారు. గతంలో స్కూల్‌లో భోజనం తినాలనిపించేది కాదు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే రుచికరంగా వండి పెడుతున్నారు.

– పి.సాయి హర్షిణి, 10వ తరగతి, జెడ్పీ హైస్కూల్ (తురకబడి)

భోజనం తినాలనిపిస్తుంది...



గతంలో భోజనం సరిగా తినాలనిపించేది కాదు. ఇప్పుడు రుచికరంగా ఉండటంతో రోజూ పాఠశాలలోనే తింటున్నాను. ఇంట్లో భోజనం మాదిరిగానే స్కూల్‌లో భోజనం ఉంటోంది. రోజుకొక ఉపాధ్యాయుడు భోజనం పరిశీలించి మాకు వడ్డిస్తారు.

– పి.వేదశ్రీ, 5వ తరతగతి (తురకబడి)

పిల్లలు ఇష్టంగా తింటున్నారు...



మధ్యాహ్న భోజనాన్ని పిల్లలు ఇష్టంగా తింటున్నారు. మా పిల్లలు ఇద్దరు ఇదే పాఠశాలలో చదువుతున్నారు. గతంలో పప్పు సారుతో భోజనం పెట్టడం వల్ల పిల్లలు తినే వారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రోజుకొక కూరతో పెట్టడంతో ఇష్టంగా తింటున్నారు.

– శాంతి, విద్యార్థి తల్లి

యువతకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు

క్రీడా సామగ్రి అందజేసిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, సచివాలయాల మండల కన్వీనర్లు, ఎంపీడీవోలతో ఆయన సమావేశమై మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ పోటీల్లో యువత పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 15 నుంచి జనవరి 28వ తేదీ వరకు ఐదు దశల్లో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. సచివాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం క్రీడా పరికరాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, మణికుమారి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, శానాపతి వెంకటరత్నం, ఎంపీడీవో జయమాధవి పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని సచివాలయ సెక్రటరీలకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్, ప్రజాప్రతినిధులు

సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. లేని పక్షంలో సమ్మెబాట పడతామన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వెంకట్రావు, పట్నాల సతీష్, లోకేశ్వరరావు, దేముళ్ల నాయుడు, సిహెచ్.రామలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

ఖైదీల హక్కులను పరిరక్షించండి

సబ్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: రిమాండ్ ఖైదీల హక్కుల పరిరక్షణకు సబ్ జైలు సిబ్బంది కట్టుబడి ఉండాలని చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలులోని ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టపరమైన హక్కుల గురించి ఆమె వివరించారు. కేసులకు సంబంధించి న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ పరిషత్ ప్రత్యేకంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ ఖైదీల్లో మానసిన పరివర్తన తీసుకు రావడానికే జైళ్లు పనిచేయాలన్న విషయాన్ని మరువొద్దన్నారు. అంతకు ముందు సబ్ జైలు ఖైదీలకు తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ వై.బాబూరావు, హెడ్ వార్డర్ వి.ఎర్రి నాయుడు పాల్గొన్నారు.



రిమాండ్ ఖైదీల ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సబ్ జడ్జి

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

మాడుగుల: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రైతులు సాధ్యమైనంత వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఏవో వాసుదేవరావు తెలిపారు. ఇప్పటికే కోసిన వరి పనలు ఉంటే యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలు కాపాడుకోవాలన్నారు. నీరు బయటకు పోయేందుకు పొలాల్లో చిన్నపాటి పాయలు (కాలువలు) ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శనివారం ఆయన ఎం.కె.వల్లాపురం, తదితర గ్రామాల్లో తన సిబ్బందితో కలిసి రైతులను అప్రమత్తం చేశారు.

అన్నదాతల కలవరం

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట/కె.కోటపాడు: తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దాంతో రైతులు కోసిన వరి పంటను ఒడ్డుకు చేర్చి కుప్పలు పెడుతున్నారు. తడి ఆరకుండానే పొలాల్లో వరి పనలను చిన్నచిన్న కుప్పలుగా పెట్టి కాపాడుకుంటున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు వరి కోతలు కోయకుండా ఉండాలని, కోసిన వరి పనలు వర్షానికి తడిస్తే ఉప్పు నీరు స్ప్రేయింగ్ చేయాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్‌కుమార్, బుచ్చెయ్యపేట ఏవో భాస్కరరావు సూచించారు.



మాడుగుల: వరి చేలు వద్ద రైతులు

ఉత్తమ సేవలకు సత్కారం

రావికమతం: మండల ప్రత్యేక ఉపాధ్యాయుడిగా ఎన్నో సేవలందిస్తూ జిల్లా అవార్డు పొందిన మహాలక్ష్మినాయుడిని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య అధికారి వై.నరసింహనాయుడు శనివారం అభినందించారు. జిల్లాలోని ప్రత్యేక ఉపాధ్యాయులకు విశాఖలో శనివారం ఒక్కరోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహాలక్ష్మినాయుడికి శాలువా కప్పి సన్మానించారు. జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య విద్య సమన్వయాధికారి శకుంతల పాల్గొన్నారు.



మహాలక్ష్మినాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

అన్ని వర్గాలకు మేలు చేస్తున్న సీఎం జగన్



శృంగవరంలో సంక్షేమ లబ్ధి పత్రాలను అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. శనివారం శృంగవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రతీ కుటుంబానికి చేసిన మేలును వివరించారు. సంక్షేమ లబ్ధి వివరాలకు సంబంధించిన బుక్‌లెట్లు అందించారు. సర్పంచ్‌లు పొంతపల్లి అప్పలనర్సమ్మ, సింగంపల్లి సత్యవతి, ఎంపీటీసీ కోటాన అశోక్, ద్వారపూడి శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, గొర్రుపోటు వెంకటరావు, చీపురపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

వాహన నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన



ఆటోడ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ తాతారావు

కె.కోటపాడు: ఆటోల్లో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించొద్దని కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు తెలిపారు. శనివారం కె.కోటపాడులో ఆటోడ్రైవర్లకు ఆయన అవగాహన కల్పించారు. వాహన నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

వెలంపాడులో పూరిల్లు దగ్ధం

– రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

మాడుగుల: కింతలి వల్లాపురం పంచాయతీ శివారు వెలంపాడులో వృద్ధండపు లక్ష్మికి చెందిన పూరిల్లు శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఈ సమాచారం అందుకున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు తన సిబ్బందితో అక్కడకు హుటాహుటిన చేరుకుని మంటలు అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. వెండి పట్టీలు, బీరువా, ధాన్యం మొత్తం కాలిపోయి రూ.1.50 లక్షల నష్టం వాటిల్లి నట్టు అంచనా వేస్తున్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు: చౌడువాడలో సతకంపట్టు వద్ద గౌరమ్మకు గవరపేటలో గౌరమ్మకు శనివారం మహిళలు సారె సమర్పించారు. తొలుత పిండి వంటలతో పాటు పండ్ల సామగ్రి పళ్లాలతో గ్రామ ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆ సమయంలో మహిళల కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. సతకంపట్టు అభివృద్ధి కమిటీ సభ్యులతోపాటు గవరపేట పెద్దలు పాల్గొన్నారు.

తలసేమియా బాధితురాలికి రూ.10 వేల పింఛన్

మాడుగుల రూరల్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న కె.జె.పురం గ్రామానికి చెందిన లంక కవితకు ప్రభుత్వం రూ.10 వేల పింఛన్ మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని శనివారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ జామి రమణబాబు ఆమెకు అందజేశారు. ప్రతి నెలా రూ.10 వేల చొప్పున వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందజేస్తుందని ఆయన తెలిపారు. తన కుమార్తె వైద్య సేవల కోసం పింఛన్ మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడుకు కవిత తండ్రి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పి. శివ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, వార్డు సభ్యుడు సూరిశెట్టి గోవిందరాజులు, నాయకులు మళ్ల కన్నబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



చిన్నారి కవితకు నగదు అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు, తదితరులు

హిందీ పరీక్షల్లో గవరవరం విద్యార్థుల ప్రతిభ

చోడవరం రూరల్: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన పలు దశల హిందీ పరీక్షల్లో గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా ప్రథమ శ్రేణి సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి వైకుంఠరావు, హిందీ ప్రచారక్ వి.నాగమణి అభినందించారు. ఉన్నత స్థానాలను అధిరోహించడానికి హిందీ ఎంతగానో దోహదపడుతుందన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజలకు బీఎల్వోలు అందుబాటులో ఉండాలి

ఓటర్ల నమోదు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో జయరాం



బీఎల్వోలకు సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం/నాతవరం/బుచ్చెయ్యపేట/రావికమతం/కె.కోటపాడు: నర్సీపట్నం మున్సిపాలిటీలో ఓటర్ల నమోదు కేంద్రాలను ఆర్డీవో హెచ్.వి.జయరాం శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, నమోదుకు వచ్చిన వివరాలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ క్యాంపెయన్‌లో భాగంగా బీఎల్వోలు పోలింగ్ బూత్‌ల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటరు జాబితాపై వచ్చే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ అన్నాజీరావు ఉన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ప్రత్యేక ఓటర్లు నమోదు శిబిరాన్ని బుచ్చెయ్యపేట, రాజాం తదితర గ్రామాల్లో డీపీవో శిరీషారాణి పరిశీలించారు. 18 ఏళ్లు దాటిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, వీఆర్వో సుధాకర్ పాల్గొన్నారు. రావికమతం హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని, కొత్తకోట పోలింగ్ బూత్‌ను మండల ప్రత్యేకాధికారి రవికిరణ్ పరిశీలించారు.

ఆయన వెంట తహసీల్దార్ మహేశ్వరరావు ఉన్నారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, చౌడువాడ గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఎన్నికల సూపర్‌వైజర్ రామచంద్రమూర్తి పరిశీలించారు. నాతవరం పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, చెర్లోపాలెం పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు పరిశీలించారు.



బుచ్చెయ్యపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి